క్లుప్తంగా

త్రైత సిద్ధాంత క్యాలెండర్ల ఆవిష్కరణ



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న జెడ్పీచైర్మన్ పాపిరెడ్డి

కొలిమిగుండ్ల: త్రైత సిద్ధాంత తెలుగు ఉగాది క్యాలెండర్‌ను ఆదివారం కొలిమిగుండ్లలోని కార్యాలయంలో జెడ్పీచైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి ఆవిష్కరించారు. త్రైత సిద్ధాంత కమిటీ సభ్యులు క్యాలెండర్ విశిష్టత గురించి వివరించారు. తెలుగు వారందరికీ ఉగాది పర్వదినం ఎంతో విశిష్టమైందని జెడ్పీచైర్మన్ పేర్కొన్నారు. ఉగాది పండుగ రోజు త్రైత సిద్ధాంత క్యాలెండర్ ఆవిష్కరించడం శుభపరిణామం అన్నారు. విశ్వావసు నామ సంవత్సరంలో ప్రజలకు అంతా మంచి చేకూరాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు నాయుడు, పోరెడ్డి రామకృష్ణారెడ్డి, భూపాల్, బాలు, రవి తదితరులు పాల్గొన్నారు.

రంజాన్ తోఫా పంపిణీ



తోఫా కిట్లను పంపిణీ చేస్తున్న కమిటీ సభ్యులు

బనగానపల్లె: రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని జమాతే ఇస్లామి హింద్ బనగానపల్లెశాఖ అధ్యక్షుడు ఎంఎం అలిబేగ్ ఆధ్వర్యంలో ఆదివారం 260 మంది నిరుపేదలకు సుమారు రూ.2 లక్షల విలువైన రేషన్ కిట్లను పంపిణీ చేశారు. ఒక్కో కిట్టు విలువ రూ. 800 ఉంటుందని వారు తెలిపారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

వాల్మీకి మహర్షి విగ్రహానికి పూజలు



వాల్మీకి విగ్రహాన్ని దర్శించుకుంటున్న వాల్మీకులు

డోన్ టౌన్: ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని పట్టణంలోని వాల్మీకి విగ్రహానికి డోన్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు శీలం భాస్కర్ నాయుడు ఆధ్వర్యంలో వాల్మీకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు వెంకటేశ్వర్లు, కేశవయ్య, నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

పండుగ రోజు మూడు రిజిస్ట్రేషన్లు



రిజిస్ట్రేషన్ పత్రాలను అందజేస్తున్న సబ్ రిజిస్ట్రార్

బనగానపల్లె రూరల్: ప్రభుత్వ ఆదేశాల మేరకు ఆదివారం, ఉగాది పండుగ రోజు అయినా రిజిస్ట్రేషన్ కార్యాలయాలు పనిచేశాయి. సాధారణ రోజుల్లో 8 నుంచి 10 వరకు రిజిస్ట్రేషన్లు జరుగుతాయి. అయితే ఆదివారంతో పాటు పండుగా రోజు కావడంతో కేవలం మూడు మాత్రమే జరిగాయని సబ్ రిజిస్ట్రార్ శ్రీనివాసులు తెలిపారు. కాగా ఆర్థిక సంవత్సరం ముగింపు కావడంతో మార్చి 30, 31వ తేదీల్లో కార్యాలయాలు యథావిధిగా పనిచేయాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిన విషయం తెలిసిందే.

కారు బోల్తా.. ముగ్గురికి స్వల్ప గాయాలు



బోల్తా పడిన కారు

డోన్ టౌన్: మండలంలోని మల్యాల రైల్వే స్టేషన్ సమీపంలో ఆదివారం కారు బోల్తాపడడంతో పట్టణానికి చెందిన ముగ్గురు యువకులు స్వల్పంగా గాయపడ్డారు. డోన్‌కు చెందిన యువకులు ఆదివారం కారులో కృష్ణగిరి మండలం కటారుకొండ గ్రామానికి వెళ్లి తిరిగి తిరిగి వస్తుండగా కారు అదుపు తప్పి రోడ్డు పక్కన బోల్తా పడింది. ముగ్గురు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. అయితే దీనిపై పోలీసులకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని తెలిసింది.

నేడు రంజాన్ ప్రార్థన వేళలు

ప్యాపిలి: రంజాన్ పవిత్ర మాసం ముగియడంతో సోమవారం ముస్లింలు ఈద్ ఉల్ ఫితర్ పర్వదినాన్ని జరుపుకోనున్నారు. పట్టణంలోని ముస్లింలు సోమవారం ఉదయం 8:30 గంటలకు కిందిగేరిలోని దర్గాకట్ట వద్దకు చేరుకోవాలని ప్రభుత్వ ఖాజీ, హఫీజ్ మహబూబ్ ఖాన్ తెలిపారు. అక్కడి నుంచి తక్బీర్ పఠిస్తూ కొత్త ఈద్గాకు చేరుకోవాలన్నారు. ఈద్గాలో ఉదయం 9 గంటలకు ఈద్ ప్రత్యేక ప్రార్థనలు ప్రారంభం కానున్నట్లు చెప్పారు. ఈద్గాకు బయలుదేరక ముందే ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా ఫిత్రా దానధర్మాలు చేయాలన్నారు.







కోవెలకుంట్ల: మారెమ్మకు పూజలు చేస్తున్న భక్తులు, సంజామల: ఆకుమల్లలో ఆంజనేయస్వామి అవుకు: రంగులు చల్లుకుంటూ సంబరాలు చేసుకుంటున్న యువత

ఊరూరా ఉగాది వేడుకలు



కొలిమిగుండ్ల: చౌడమ్మను దర్శించుకుంటున్న భక్తులు



బనగానపల్లె: కొండపేట సుంకులమ్మ ఆలయంలో..

• భక్తులతో పోటెత్తిన ఆలయాలు

కోవెలకుంట్ల: బనగానపల్లె నియోజకవర్గంలోని ఆయా గ్రామాల్లో ప్రజలు ఆదివారం ఉగాది పండుగను భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. విశ్వావసు నామ సంవత్సరం అన్ని విధాలా కలిసి రావాలని కోరుతూ భక్తులు ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. కోవెలకుంట్ల పట్టణంలోని సుంకులమ్మ, మారెమ్మ, పెద్దమ్మ, పట్టణ శివారులోని పాటిమీద ఆంజనేయస్వామి ఆలయాలు భక్తులతో పోటెత్తాయి. అలాగే మండలంలోని జోళదరాశి, కలుగొట్ల, సౌదరదిన్నె, అమడాల, బిజనవేముల, లింగాల, గుళ్లదూర్తి తదితర గ్రామాల్లో మహిళలు పెద్ద సంఖ్యలో ఆలయాలకు చేరుకుని ప్రదక్షిణలు నిర్వహించి అమ్మవార్లను దర్శించుకున్నారు. పాటిమీద ఆంజనేయస్వామి దేవాలయ ఆవరణలో పవన్ ఏజెన్సీ నిర్వాహకులు శ్రీనివాసరెడ్డి, జగన్ మోహన్‌రెడ్డి, అవినాష్‌రెడ్డి భక్తులకు పానకం పంపిణీ చేశారు.

సంజామలలో..

సంజామల: మండలంలోని కానాల సుంకులమ్మ, ఆకుమల్ల, ఆల్వకొండ క్రాస్ వద్దనున్న ఆంజనేయస్వామి ఆలయాల్లో భక్తులు దైవ దర్శనం చేసుకున్నారు. గ్రామాల్లో ఏరువాగ సాగు నిర్వహించారు.





పాటిమీద ఆంజనేయస్వామి ఆలయంలో.. ,భక్తులకు పానకం పంపిణీ చేస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

గ్రామ దేవతలకు ప్రత్యేక పూజలు


కొలిమిగుండ్ల: ఉగాది పర్వదినం సందర్భంగా గ్రామ దేవతలకు ప్రత్యేక పూజలు చేశారు. కొలిమిగుండ్లలోని చౌడేశ్వరిదేవి, ఎస్సీ కాలనీలోని కుంటిమ్మ ఆలయానికి భక్తులు బారులు తీరారు. కోటపాడు చౌడమ్మ, బెలుం శింగవరంలోని వీరపాపులమ్మతో పాటు కనకాద్రిపల్లె, అంకిరెడ్డిపల్లె, అబ్దులాపురం, బెలుం తదితర గ్రామాల్లోని పెద్దమ్మ, సుంకులమ్మ, మారెమ్మను పూలతో ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు చల్లంగా చూడమ్మ తల్లీ అని వేడుకున్నారు. పలు చోట్ల భక్తులకు తీర్థప్రసాదాలు, అన్నదానం ఏర్పాటు చేశారు.

అమ్మవారి ఆలయాల్లో భక్తుల సందడి

బనగానపల్లె రూరల్: మండలంలోని ఆయా గ్రామాల్లో ఉన్న అమ్మవారి ఆలయాలకు భక్తులు తరలివెళ్లి పూజలు చేశారు. బోయపేటకాలనీలోని సుంకులమ్మ, కొండపేటలోని సుంకులమ్మ ఆలయాల్లో బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. పలు ఆలయాల్లో పంచాంగ శ్రవణం వినిపించారు.

అవుకులో..

అవుకు: మండల పరిధిలో ఉగాదిని ఘనంగా జరుపుకున్నారు. అమ్మవారి ఆలయాలకు భక్తులు పెద్ద ఎత్తున తరలివెళ్లి దర్శించుకున్నారు. అవుకులోని పలు వీధుల్లో ముగ్గుల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులను అందించారు. గ్రామంలోని యువకులు రంగులు చల్లుకుంటూ, డీజే పాటలకు నృత్యాలు చేస్తూ సంబరాలు చేసుకున్నారు.







డోన్: పాతబస్టాండ్‌లోని దుర్గమ్మ, బేతంచెర్లలో సుంకులా పరమేశ్వరి, వేంకటేశ్వరస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

భక్తిశ్రద్ధలతో ఉగాది

డోన్ టౌన్: తెలుగువారి నూతన సంవత్సరం, ఉగాది పర్వదినాన్ని ఆదివారం భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఉదయం ఇంటిని మామిడి తోరణాలు, పూల మాలలతో అలంకరించారు. అనంతరం ఇంటి దేవతలకు నైవేద్యం సమర్పించి పూజలు చేశారు. గ్రామ దేవతలైన సుంకులమ్మ, మారెమ్మ, కనకదుర్గమ్మ తదితర దేవతలకు విశేష పూజలు నిర్వహించారు. స్థానిక గోదాదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామిని విశేషాలంకరణ చేసి భక్తులకు దర్శనం కల్పించారు. ఉగాది పచ్చడి పంపిణీ చేశారు. అలాగే పాతపేట రామాలయంలో అర్చకుడు శేషశయన శర్మ పంచాంగ శ్రవణం చేశారు. ఈ సంవత్సరం ప్రజలందరికీ బాగుంటుందని చెప్పారు.

బేతంచెర్లలో..

బేతంచెర్ల: ఉగాది సంర్భంగా రైతులు వేకువజామునే వృషభాలను శుభ్రం చేసి పూజలు చేశారు. ఉగాది రోజున పొలం పనులు చేపడితే మంచి దిగుబడులు వస్తాయన్న నమ్మకంతో భూమాతకు పూజలు చేసి పొలం పనులు చేపట్టారు. అలాగే గ్రామదేవతలైన మారెమ్మ, సుంకలమ్మ, పెద్దమ్మను దర్శించుకున్నారు. బేతంచెర్ల చెన్నకేశవస్వామి, వేంకటేశ్వరస్వామి, చౌడేశ్వరీదేవి, సుంకులా పరమేశ్వరీదేవి ఆలయంలో భక్తుల రద్దీ నెలకొంది.

ప్యాపిలి: విశ్వావసు నామ సంవత్సరాదిని పురస్కరించుకుని ప్రజలు వివిధ దేవాలయాలకు వెళ్లి దైవ దర్శనం చేసుకున్నారు. పలు ఆలయాల్లో సాయంత్రం ఆలయ పురోహితులు పంచాంగాన్ని చదివి వినిపించారు. నల్లబల్లి గ్రామంలో వెలసిన సంకులమ్మ ఆలయానికి వివిధ గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.



ప్యాపిలి: నల్లబల్లి సుంకులమ్మ ఆలయం వద్ద భక్తుల సందడి



డోన్: రామాలయంలో పంచాంగ శ్రవణం



బేతంచెర్లలో దర్శనానికి బారులు తీరిన భక్తులు



ప్యాపిలి: అమ్మవారిశాలలో పంచాంగాన్ని వింటున్న ఆర్యవైశ్యులు

చౌడేశ్వరిదేవి ఉత్సవాలు ప్రారంభం



ఆలయం చుట్టు పన్నేరపు బండ్ల ప్రదక్షిణ

బనగానపల్లె రూరల్: నందవరం గ్రామంలో వెలసిన శ్రీచౌడేశ్వరిదేవి జ్యోతి, రాయబారాధి ఉత్సవాలు ఆదివారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఉదయం ఆలయ అసిస్టెంటెంట్ కమిషనర్ కామేశ్వరమ్మ ఆధ్వర్యంలో ముందుగా గణపతి, పుణ్యాహ వచనం, అంకురార్పణ పూజలు నిర్వహించారు. గ్రామంలోని ప్రతి ఇంటి నుంచి మహిళలు బోనాలతో ప్రదర్శనగా వచ్చి అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించారు. ఆలయం వద్ద పంచాంగ శ్రవణం గావించారు. విఠలాపురం, అప్పలాపురం, పండ్లాపురం, నందవరం గ్రామాలకు చెందిన రైతులు తమ ఎడ్ల బండిపై అమ్మవారి నైవేద్యం పెట్టుకుని ఆలయం చుట్టూ పన్నేరు బండ్లు తిప్పు ప్రాకార రథోత్సవాన్ని సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. నందివర్గం ఎస్ఐ వెంకటసుబ్బయ్య, బనగానపల్లె రూరల్ సీఐ మంజునాథ్‌రెడ్డి ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఉత్సవాలు ఏప్రిల్ 5వ తేదీ వరకు జరగనున్నాయి.



అమ్మవారికి బోనాలు సమర్పించేందుకు ప్రదర్శనగా వస్తున్న భక్తులు

మూగ వేదన



సినిమా పోస్టర్‌ను తింటున్న ఆవు



దాహం తీర్చుకునేందుకు వెళ్లి శునకం పాట్లు

డోన్: వర్షాభావ పరిస్థితులకు తోడు పశుగ్రాసం కొరత తీవ్రంగా ఉండడంతో ఎట్టిపశువుల సంఖ్య పెరిగిపోతోంది. ఆకలికి తాళలేక డోన్ పట్టణంలో ప్లాస్టిక్ కవర్లు, సినిమా పోస్టర్లు లాంటి వ్యర్థ పదార్థాలను ఆవురావురుమంటూ తినేస్తున్నాయి. ఫలితంగా జీర్ణ సంబంధ వ్యాధుల బారినపడి మత్యువాత పడుతున్నాయి. మరో వైపు మూగజీవాలకు నీరు లేక అలమటిస్తున్నాయి. ఇటీవల వైఎస్ నగర్ ప్రాంతంలో ఓ కుక్క నీటి కోసం ఒక ఇంటి సమీపంలో ఉన్న బిందెలో తలదూర్చి ప్రాణం మీదకు తెచ్చుకుంది. బిందెలో కుక్క తల ఇరుక్కుపోవడంతో అరగంట సేపు ప్రాణభయంతో విలవిలలాడింది. స్థానికులు కొందరు బిందెను గట్టిగా పట్టుకుని లాగడంతో కుక్క బయటపడి పరుగున వెళ్లిపోయింది.

రోడ్డుపైనే మురుగు కుంట

బనగానపల్లె రూరల్: మండలంలోని పండ్లాపురం-వెంకటాపురం మార్గంలో రోడ్డుపై మురుగునీరు పేరుకుపోయింది. పాదచారులు, వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. మురుగు కాలువ ధ్వంసం కావడంతో ప్రవహించే అకాశం లేకుండా పోయింది. దీంతో మురుగునీరు అక్కడే నిల్వ చేరి దుర్వాసన వెదజల్లుతోంది. దోమలు వృద్ధి చెందుతున్నాయి. అధికారులు స్పందించి మురుగు నిల్వ ఉండకుండా తగిన చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.



పండ్లాపురం-వెంకటాపురం మార్గంలో రోడ్డుపై మురుగు

రేపు 'పది' సోషల్ పరీక్ష

డోన్ టౌన్: పదో తరగతి సోషల్ స్టడీస్ (సాంఘిక శాస్త్రం) పరీక్ష సోమవారం జరగాల్సి ఉండగా మంగళవారం (ఏప్రిల్ 1వ తేదీ)కి మార్పు చేసినట్లు మండల విద్యాధికారి ప్రభాకర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. రంజాన్ పండుగ సందర్భంగా ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు. ఆయా స్కూల్ ప్రధానోపాధ్యాయులు ఈ విషయాన్ని విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు సమాచారం తెలిసేలా తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు.

మందుబాబుల అల్లరి చేష్టలు



ఇండస్ట్రియల్ పార్కులో చెలరేగుతున్న మంటలు

కొలిమిగుండ్ల: మందు బాబుల ఆగడాలు, అల్లరి చేష్టలకు హద్దులు లేకుండాపోతున్నాయి. ఆదివారం స్థానిక కస్తూర్బా పాఠశాల సమీపంలో ఉన్న ఇండస్ట్రియల్ పార్కులో మద్యం సేవించేందుకు వచ్చి సిగరెట్లు తాగి పడేయడంతో మంటలు పెద్దగా వ్యాపించాయి. 52 ఎకరాల్లో పార్కు ఏర్పాటు చేశారు. మంటలు ఒక చోట నుంచి మరో చోటకు వ్యాపించి పెద్దగా పొగ అలుముకుంది. నిత్యం మందు బాబులు ఇక్కడ మద్యం సేవిస్తుంటారు. ఎక్కడ చూసినా ఖాళీ మద్యం బాటిళ్లు దర్శనమిస్తుంటాయి. సమీపంలోనే రైతులు తోటలు ఉన్నాయి. మందు బాబుల ఆగడాలకు చెక్‌పెట్టాల్సిన అవసరముందని స్థానికులు కోరుతున్నారు.

మద్దిలేటిస్వామి ఆలయంలో పంచాంగ శ్రవణం



ఆలయంలో పంచాగ శ్రవణం వినిపిస్తున్న వేదపండితులు



స్వామివారికి వెండి పంచ పాత్ర, కిరీటం అందజేస్తున్న దాతలు

బేతంచెర్ల: మండల పరిధిలోని వైష్ణవ పుణ్యక్షేత్రమైన మద్దిలేటి నరసింహస్వామి ఆలయంలో విశ్వావసు నామ సంవత్సరాది ఉగాదిని పురస్కరించుకుని ఆలయ ఉప కమిషర్, ఈఓ రామాంజనేయులు ఆధ్వర్యంలో పంచాంగ శ్రవణం ఏర్పాటు చేశారు. ఆదివారం ఉదయం ఆలయ వేదపండితులు జ్వాలా చక్రవర్తి, కళ్యాణ చక్రవర్తి మద్దిలేటి నరసింహస్వామి, మహాలక్ష్మి అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేశారు. పంచాంగ శ్రవణం వినిపించారు. కాగా స్వామివారికి ప్రొద్దుటూరుకు చెందిన ఆవుల మద్దిలేటి రెడ్డి, తులసమ్మ దంపతులు వెండి పంచపాత్ర, వెండి కిరీటం కానుకగా సమర్పించారు. దాతలకు స్వామి, అమ్మవార్ల తీర్థప్రసాదాలు అందజేసి శేష వస్త్రంతో సత్కరించారు.

సంస్కృతి పరిరక్షణకు కృషి



విశ్వహిందూ పరిషత్ తెలుగు క్యాలెండర్ల ఆవిష్కరణ

బేతంచెర్ల: ప్రపంచ దేశాలకు ఆదర్శమైన హిందూ సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణకు విశ్వహిందూ పరిషత్ కృషి చేస్తుందని విశ్వహిందూ పరిషత్ నంద్యాల జిల్లా అధ్యక్షుడు బుగ్గన చంద్ర మౌలీశ్వర్‌రెడ్డి అన్నారు. ఆదివారం పట్టణంలోని ఆంజనేయస్వామి ఆలయ ఆవరణలో ఉగాది పండుగను పురస్కరించుకుని విశ్వహిందూ పరిషత్ విశ్వావసు నామ తెలుగు సంవత్సరాది క్యాలెండర్లను ఆవిష్కరించారు. మారుతి కృష్ణ, గుండా గోపాలు, హుసేన్‌రెడ్డి, పుల్లారెడ్డి, గూని నాగరాజు, విశ్వనాథ్‌రెడ్డి, నాగ మోహన్, రామూర్తి పాల్గొన్నారు.

రంజాన్ ప్రార్థనలకు ముస్తాబు



జామియా మసీదులో ఏర్పాట్లపై చర్చిస్తున్న మండల ఖాజీ

బేతంచెర్ల: రంజాన్ పండుగ సందర్భంగా ముస్లింల ప్రార్థనలకు ఈద్గాలు ముస్తాబయ్యాయి. మండల ఖాజీ నూర్ అహ్మద్, ముస్లింలతో కలిసి కొలుములపల్లె రహదారిలోని ఈద్గాను ఆదివారం పరిశీలించారు. వేసవిని దృష్టిలో ఉంచుకుని సోమవారం ప్రార్థనలకు తరలివచ్చే ముస్లింలకు నీడ కోసం షామియానాలు, తాగునీటి సౌకర్యంపై చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రంజాన్ పండుగ రోజున ముస్లింలు ఉదయం 9 గంటలకు ఈద్గా దగ్గరకు చేరుకోవాలని, 9:30గంటలకు ప్రత్యేక ప్రార్థనలు ప్రారంభం అవుతాయన్నారు. వచ్చే ముందు ప్రతి ఒక్కరు ఫిత్రా దానం రూ.90 పేదలకు పంచి రావాలని తెలిపారు. అల్లా దయతో అందరూ సంతోషంగా ఉండాలని ఆకాంక్షించారు.



తిమ్మనాయినపేట చెరువులో పూర్తిగా తగ్గిన నీరు



సద్దలవెంగన్న చెరువులో మోస్తరుగా ఉన్న నీరు

అడుగంటుతున్న జలాలు

కొలిమిగుండ్ల: భానుడి ప్రతాపానికి చెరువుల్లో ఉన్న కాసిన్ని నీళ్లు క్రమంగా తగ్గిపోతున్నాయి. సాగు, తాగునీటి బోర్లపై తీవ్ర ప్రభావం చూపుతోంది. మండలంలో నాయినపల్లె సమీపంలోని సద్దలవెంగన్న చెరువు, తిమ్మనాయినపేట, హనుమంతుగుండం చిన్న, పెద్ద చెరువులు, అబ్దులాపురం సమీపంలోని దయ్యాల చెరువులు ఉన్నాయి. జనవరి నెలలో ఓ మాదిరిగా చెరువుల్లో జలాలు ఉండేవి. ప్రస్తుతం ఎండ తీవ్రత ఎక్కువగా ఉండడంతో పూర్తిగా నీరు తగ్గుముఖం పడుతున్నాయి. చెరువులకు చుట్టు పక్కన ఉన్న గ్రామాల పరిధిలో ఉన్న తాగునీటి,వ్యవసాయ బోర్లలో ఇప్పటికే గంగమ్మ పాతాళానికి చేరుకుంది. వేసవి పూర్తయ్యేలోగా పశువులకు తాగేందుకు చెరువుల్లో నీళ్లు ఉండే అవకాశాలు కనిపించడం లేదు. గత ఏడాది వర్షాలు అంతంత మాత్రంగానే కురిశాయి. గ్రామాల్లో చాలా వరకు బోర్ల నుంచి నీళ్లు రాకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తాగునీటి సమస్య సైతం జఠిలమయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి.